క్లుప్తంగా

ఉపాధ్యాయుడి తీరుపై గ్రామస్తుల ఆగ్రహం

సర్సాపూర్(జి): మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఓ ఉపాధ్యాయుడి తీరుపై విద్యార్థినుల తల్లిదండ్రులు, గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ పిల్లలతో సదరు ఉపాధ్యాయుడు అసభ్యకర మాటలు మాట్లాడుతున్నారని వారు మండిపడ్డారు. ఈమేరకు తల్లిదండ్రులు శనివారం పాఠశాలకు వెళ్లి మరోసారి అసభ్యకరంగా మాట్లాడితే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని ఉపాధ్యాయుడిని హెచ్చరించారు. ఈ విషయమై హెచ్‌ఎం, ఎంఈఓ కిషన్ రావును 'సాక్షి' ఫోన్‌లో సంప్రదించగా ఉన్నతాధికారులకు సమాచారం అందించి ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకుంటామని అన్నారు. మరోసారి ఇలాంటివి జరగకుండా చర్యలు చేపడతానని చెప్పుకొచ్చారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

లోకేశ్వరం: మండలంలోని సాథ్‌గాం శివారులోని సుద్దవాగు నుంచి శనివారం అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు తహసీల్దార్ మోతీరాం తెలిపారు. అనుమతి లేకుండా వాగు నుంచి పెండ్‌పల్లి వైపు ఇసుక తీసుకెళ్తున్న ట్రాక్టర్‌ను తహసీల్దార్ కార్యాలయానికి తరలించి రూ.ఐదు వేల జరిమానా విధించామని పేర్కొన్నారు.

ఉపాధి అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలి

కడెం: మహిళలు ఉపాధి అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. యాక్సెంచర్ ఈడీఐఐ ఆధ్వర్యంలో మండలంలోని లింగాపూర్‌లో ఏర్పాటు చేసిన గ్రీన్ లీఫ్ ప్లేట్ దుకాణాన్ని ప్రారంభించారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. లచ్చన్న, ఈడీఐఐ మాస్టర్ ట్రైనర్ రవి, దేవేందర్ తదితరులు ఉన్నారు.

విధులకు ఆటంకం కలిగించినందుకు కేసు

కుంటాల: మండలంలోని సూర్యాపూర్ పంచాయతీ కార్యదర్శి రాజు విధులకు ఆటంకం కలిగించిన ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై భాస్కరాచారి శనివారం పేర్కొన్నారు. కార్యదర్శి విధుల్లో ఉండగా అదే గ్రామానికి చెందిన తానూర్ భోజన్న మద్యం తాగి వచ్చి అసభ్యపదజాలంతో దూషించాడు. కార్యదర్శి ఫిర్యాదు మేరకు భోజన్నపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

'మహాసభ జయప్రదం చేయాలి'

ఖానాపూర్: హనుమకొండలో ఈనెల 9న ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రథమ రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర నాయకుడు ఖాజా మెయినొద్దీన్ కోరారు. శనివారం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ విశ్రాంతిభవనం ఆవరణలో యూనియన్ మహాసభ కరపత్రాలను ఆవిష్కరించారు. మోదీ ప్రభుత్వం కార్మికుల హక్కులు కాలరాసే నాలుగు లేబర్ కోడ్‌లను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఐఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి మంచికంటి లక్ష్మణ్, నాయకులు నర్సవ్వ, లక్ష్మీకాంతం, రాజేశ్ తదితరులు ఉన్నారు.

ప్రణాళికతో చదవాలి

సోన్: ప్రణాళిక, పట్టుదలతో చదివితే పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని పూర్వ విద్యార్థి తలారి చందు పేర్కొన్నారు. మండలంలోని సిద్దులకుంట ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివి బాసర ట్రిపుల్ ఐటీలో సీటు పొందిన చందుతో శనివారం విద్యార్థులకు మోటివేషనల్ క్లాస్ నిర్వహించినట్లు హెచ్‌ఎం హరీశ్‌రెడ్డి తెలిపారు. 45 రోజులు జరిగే ప్రత్యేక తరగతులకు హాజరవుతూ ఉపాధ్యాయుల సూచనలు పాటించాలని పేర్కొన్నారు.

అనాథకు అంత్యక్రియలు

సోన్: మండలానికి చెందిన కంచెట్టి(60) అనే అనాథ శనివారం మృతి చెందాడు. ఈసందర్భంగా పంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్ గ్రామస్తులతో కలిసి పంచాయతీ ట్రాక్టర్‌లో మృతదేహాన్ని గోదావరి ఒడ్డుకు తీసుకెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు.

ముగిసిన సప్తాహం

ముధోల్: మండలంలోని చించాలలో అఖండ హరినామ సప్తాహం శనివారం ముగిసింది. మహిళలు ఉదయం మంగళహారతులతో తరలిరాగా నారాయణ మహారాజ్ ఆధ్వర్యంలో రోజు కాగడహారతి, గథభజన నిర్వహించి జ్ఞానేశ్వరి పారాయణం చేశారు.

ఉమ్రిలో నాలుగోరోజుకు..

తానూరు: మండలంలోని ఉమ్రి(కే) గ్రామంలో కొనసాగుతున్న అఖండ హరినామ సప్తాహం శనివారం నాలుగో రోజుకు చేరింది. ఉదయం జ్ఞానేశ్వరి పారాయణం, మధ్యాహ్నం భజన, భగవద్గీత కీర్తనలు చేపడుతున్నారు. భక్తులకు అన్నదానం అందిస్తున్నారు.

పరీక్షలపై దృష్టి సారించాలి

భైంసారూరల్: విద్యార్థులు వార్షిక పరీక్షలపై దృష్టి సారించాలని మోహన్‌రావుపటేల్ ప్రజా ట్రస్ట్ చైర్మన్ మోహన్‌రావుపటేల్ అన్నారు. మండలంలోని కామోల్, మాటేగాం ప్రభుత్వ పాఠశాలల్లో 50 మంది పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు, ట్రస్ట్ సభ్యులు ఉన్నారు.

వైభవంగా జాతర

- ఖానాపూర్ సాయిబాబా ఆలయానికి పోటెత్తిన భక్తజనం


సాయిబాబా విగ్రహానికి అభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే బొజ్జు

ఖానాపూర్: పట్టణంలోని సాయిబాబా ఆలయ 28వ వార్షికోత్సవంలో భాగంగా శనివారం జాతర వైభవంగా సాగింది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలిరాగా రామకృష్ణశర్మ, శశిధర్‌శర్మ ఆధ్వర్యంలో సాయిబాబా మూలవిరాట్‌కు మహాకుంభాభిషేకం, శివపార్వతుల, లక్ష్మీనారాయణుల కల్యాణ మహోత్సవం, మహా పూర్ణాహుతి, అన్నపూజ తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహా అన్నదానం చేశారు. అంతకుముందు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు హాజరవగా అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం ఎమ్మెల్యేకు తీర్థప్రసాదం అందజేశారు. అంతకముందు మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్, నిర్మల్ ఏఎస్పీలు రాజేశ్ మీనన్, ఉపేంద్రరెడ్డి, బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇంచార్జీ జాన్సన్ నాయక్, బీజేపీ నాయకులు రితీశ్‌రాథోడ్ వేర్వేరుగా ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు అంకం రాజేందర్, ప్రదీప్‌తోపాటు కమిటీ సభ్యులు వారిని ఘనంగా సన్మానించారు.

50వేల మంది దర్శనం..

భక్తులు ఉదయం నుంచే క్యూలైన్‌లో బారులు తీరారు. సుమారు 50వేలకు పైగా భక్తులు హాజరై సాయిబాబాను దర్శించుకున్నారు. స్థానిక కళాసమైక్య ఆధ్వర్యంలో సాంస్కృతిక భజనలు, నృత్యాలు నిర్వహించారు. 40 క్వింటాళ్లకు పైచిలుకు బియ్యంతో మహాఅన్నదానం ఏర్పాటు చేశారు. అనంతరం ఉట్టికొట్టుడు, పల్లకీసేవ, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఆలయానికి వచ్చిన ప్రముఖులకు జ్ఞాపికలు అందించి సన్మానించారు.


కల్యాణం తిలకిస్తున్న భక్తులు


జాతరలో భక్తుల రద్దీ

'దేశాన్ని బలహీనపరిచేలా కేంద్ర బడ్జెట్'


బడ్జెట్ ప్రతులు దహనం చేస్తున్న నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: దేశ అభివృద్ధిని బలహీనపరిచేలా కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బొమ్మెన సురేశ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం నూతన్ కుమార్ అన్నారు. సీఐటీయూ, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీల ఆధ్వర్యంలో కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ నిర్మల్ ఆర్డీవో కార్యాలయం ఎదుట బడ్జెట్ ప్రతులు దహనం చేశారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్పొరేట్ కంపెనీల పెట్టుబడిదారులకు 2 లక్షల 14 వేల కోట్ల బకాయిలను మాఫీ చేసి ప్రభుత్వరంగ బ్యాంకులను బలహీన పరుస్తుందన్నారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేసి కనీస వేతనం రూ 26వేలకు పెంచాలన్నారు. ఉపాధి కార్మికులకు రోజు కూలి రూ.600 అందించి ఏడాదికి 200 రోజులు పని కల్పించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి తిమ్మాపురం ముత్తన్న, నాయకులు పోశెట్టి, గంగారం, తొడసం శంభు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి


ఖానాపూర్‌లో మాట్లాడుతున్న ఎంపీడీవో

ఖానాపూర్: మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది దృష్టి సారించాలని ఎంపీడీవో సునీత అన్నారు. శనివారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, భగీరథ అధికారులు, సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. మిషన్ భగీరథ పైపులైన్లకు లీకేజీలు, ఇతర సమస్యలు తెలుసుకున్నారు. ఎంపీవో రత్నాకర్‌రావు, తదితరులు ఉన్నారు.

లోకేశ్వరం: గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చూడాలని ఎంపీడీవో వెంకటరమేశ్ అన్నారు. శనివారం మండలంలోని కన్కపూర్ గ్రామంలో భగీరథ నల్లాలను ఎంపీడీవో పరిశీలించారు. ఇంటింటికి బిగించిన పైపులకు నల్లాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. నీటి ట్యాంకులను శుభ్రం చేస్తూ.. లీకేజీలకు మరమ్మతులు చేయించాలని పేర్కొన్నారు. ఆయన వెంట వాటర్‌గ్రిడ్ ఏఈ సుమన్, కార్యదర్శి సుప్రియ ఉన్నారు.

భైంసా విద్యార్థినికి డీఈవో ప్రశంస

భైంసాటౌన్: జిల్లా కేంద్రంలోని టీఎన్జీవోస్ సంఘ భవనంలో ఇటీవల ఎయిడ్స్ వ్యాధిపై అవగాహనలో భాగంగా జిల్లాస్థాయి పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో భైంసా పట్టణానికి చెందిన విద్యార్థిని శ్రాగ్వి ప్రతిభ కనబరిచి రెండోస్థానంలో నిలిచింది. డీఈవో రామారావు చేతుల మీదుగా బహుమతి అందుకుంది. దీంతో శ్రాగ్విని పాఠశాల ఉపాధ్యాయులతోపాటు పలువురు అభినందించారు.

వసంతపంచమికి అన్ని ఏర్పాట్లు


మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ ఆనంద్‌రావుపటేల్

భైంసా: బాసరలో వసంత పంచమి ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ సిందే ఆనంద్‌రావుపటేల్ అన్నారు. శనివారం బాసరలో విలేకరులతో మాట్లాడారు. మూడు రోజుల కిందట జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క బాసరకు వచ్చి ఏర్పాట్లపై సమీక్షించారని తెలిపారు. శుక్రవారం కలెక్టర్ అభిలాష అభినవ్ పుణ్యక్షేత్రం సందర్శించి ఏర్పాట్లు, స్నానఘట్టాలు పరిశీలించారని పేర్కొన్నారు. గతంలో ఏయే ప్రభుత్వం వసంతపంచమి వేడుకలను పట్టించుకోలేదని గుర్తు చేశారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ బాసర మండల అధ్యక్షులు మమ్మాయి రమేశ్, నాయకులు బాశెట్టి రాజన్న ఉన్నారు.

ఆడపిల్లలను ఉన్నతంగా తీర్చిదిద్దుతాం

నిర్మల్‌ఖిల్లా: ఆడపిల్లల్ని సామాజికంగా ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఆయాశాఖల జిల్లా అధికారులు పిలుపునిచ్చారు. బేటి బచావో–బేటి పడావో కార్యక్రమం ప్రారంభించి దశాబ్దం పూర్తి చేసుకుంటున్న నేపథ్యంలో ఈనెల ఒకటో తేదీ నుంచి మార్చి 8 వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అందులో భాగంగా కలెక్టర్ ఆదేశాల మేరకు పట్టణంలోని స్థానిక ప్రభుత్వ బాలికల ఆశ్రమ పాఠశాలలో అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా ఐసీడీఎస్ అధికారులు నాగలక్ష్మి, విజయ్, గౌరిమిషన్ శక్తి జిల్లా సమన్వయకర్త కె.సవిత తదితరులు మాట్లాడారు. సమాజంలో బాలికల హక్కులు వాటి పరిరక్షణ కోసం పాటుపడాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులు తుకారం, జిల్లా బాలల పరిరక్షణ అధికారి సగ్గం రాజు, చైల్డ్ లైన్స్ ప్రతినిధి పద్మావతి, మిషన్ శక్తి సిబ్బంది జ్యోతి, మౌనిక, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న అధికారులు

సంక్షిప్త వార్తలు

పోస్టర్ ఆవిష్కరణ

లోకేశ్వరం: మండలంలోని వాస్తాపూర్ గ్రామంలో శనివారం ఆత్మీయ నిలయం పోస్టర్‌ను మా అమ్మ-నాన్న ఫౌండేషన్ చైర్మన్ మాదిరి ఆంజనేయులు ఆవిష్కరించారు. గ్రామాల్లో అనాథలు, నిరాదరణకు గురైన వారిని పోచంపాడులోని ఆత్మీయ నిలయం(అనాథ ఆశ్రమం)లో చేర్పించాలని కోరారు. భోజన్న, భోజారెడ్డి, చిన్నులు ఉన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

కుంటాల: మండలంలోని అందాకూర్ మాజీ సర్పంచ్ కొత్తపల్లి బుచ్చన్న తల్లి నర్సమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా.. బాధిత కుటుంబాన్ని శనివారం మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పటేల్ పరామర్శించారు. మృతికి కారణాలు తెలుసుకున్నారు. ఆయన వెంట జెడ్పీ మాజీ చైర్మన్ జుట్టు అశోక్, నిర్మల్ మున్సిపల్ మాజీ చైర్మన్ గంధ్రత్ ఈశ్వర్,భోజారాం పటేల్, ప్రకాశ్‌గౌడ్, తూర్పాటి వెంకటేశ్, సమత సుదర్శన్, ఎక్సైజ్ ఎస్సై వెంకటేశ్, న్యాయవాది రవీందర్‌సింగ్ ఉన్నారు.

భైంసాలో..

భైంసాటౌన్: పట్టణానికి చెందిన వైద్యుడు మధుసూదన్‌గౌడ్ తల్లి అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే నారాయణ్‌రావు పటేల్ శనివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. బ్లాక్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు శంకర్ చంద్రే, మాజీ ఎంపీపీ భోజారం పటేల్, దేవన్న, శరత్ పాల్గొన్నారు.

పరామర్శ

ఖానాపూర్: పట్టణంతోపాటు మండలంలోని పలు గ్రామాల్లో శనివారం బీజేపీ రాష్ట్ర నాయకుడు రితీష్ రాథోడ్ పర్యటించారు. బాదనకుర్తి, సుర్జాపూర్ గ్రామాల్లోని పలు బాధిత కుటుంబాలను పరామర్శించారు. అంకం మహేందర్, ఆకుల శ్రీనివాస్, పుప్పాల ఉపేందర్, కీర్తి మనోజ్, దాసరి శ్రీనివాస్, సురేందర్, రమేశ్, సురేందర్ ఉన్నారు.

బీమా పరిహారం పంపిణీ

భైంసారూరల్: మండలంలోని వానల్‌పాడ్ గ్రామానికి చెందిన వాటోలి భూమన్న ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందాడు. భూమన్న పోస్టాఫీసులో రూ.520 చెల్లించి బీమా తీసుకున్నాడు. ఆసుపత్రి ఖర్చుల కింద అతడికి మంజూరైన రూ.51,300 పరిహారం చెక్కును శనివారం బ్రాంచ్ పోస్టుమాస్టర్ స్వామి అందించారు. కార్యక్రమంలో కార్యదర్శి గాయత్రి, సాయారెడ్డి, రాంకుమార్, నరేశ్, సుభాశ్ ఉన్నారు.

'బడ్జెట్‌తో తీవ్ర అన్యాయం'

లోకేశ్వరం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌తో పేద, మధ్యతరగతి వర్గాలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని సీఐటీయూ జిల్లా నాయకుడు పోశెట్టి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యంగా స్కీం వర్కర్ల హక్కులను నిర్లక్ష్యం చేస్తూ కార్మిక సంక్షేమ నిధులను తగ్గించడం సరికాదని పేర్కొన్నారు. శనివారం లోకేశ్వరం పంచాయతీ ఆవరణలో మాట్లాడారు. ఆశ వర్కర్లు నంద, గోదావరి, మమత, భోజమ్మ, గంగామణి, భోజన్న ఉన్నారు.

ధ్యానాంజనేయ విగ్రహానికి స్వాగతం

దిలావర్‌పూర్: మండలంలోని కాల్వ శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయ కోనేటి వద్ద ఎకరం విస్తీర్ణంలో ధ్యానాంజేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి. విగ్రహ దాత ఆయిండ్ల చంద్రమోహన్‌రెడ్డి శనివారం ప్రతిష్ఠాపన ప్రదేశానికి విగ్రహం తీసుకురాగా భక్తులు మంగళహారతులతో స్వాగతం పలికారు. ఈనెల 6వ తేదీ నుంచి 8 వరకు ప్రతిష్ఠాపన మహోత్సవాలు నిర్వహిస్తామని నర్సారెడ్డి వెల్లడించారు.

బీజేపీ పట్టణ అధ్యక్షుడికి సన్మానం

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని నెహ్రూ పాఠశాలలో బీజేపీ పట్టణ అధ్యక్షుడిగా నియమితులైన ఆకుల కార్తీక్‌ను శనివారం టీచర్లు సన్మానించారు. బీజేపీ నాయకులు ఒడిసెల అర్జున్, కొండాజీ శ్రావణ్, టీచర్లు నవీన్, శ్రీనివాస్, వినోద్ ఉన్నారు.

పొదుపు అలవర్చుకోవాలి

కుంటాల: ప్రతి ఒక్కరూ పొదుపు అలవర్చుకోవాలని ఏపీఎం అశోక్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని ఓలా గ్రామంలోని లలితాదేవి గ్రామ సంఘ సమావేశంలో మాట్లాడారు. బ్యాంకు ద్వారా పొందిన రుణాలను సకాలంలో చెల్లించాలని కోరారు. సీసీ కవిత, వీవోఏలు నవనీత, హసీన, సంఘాల మహిళలు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లోనే చేరాలి

సారంగాపూర్: కేజీబీవీ, గురుకులం, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు..డిగ్రీ కోసం ప్రభుత్వ కళాశాలల్లోనే చేరాలని అధ్యాపకుడు డాక్టర్ శ్రీనివాస్ సూచించారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో కరపత్రాలు పంపిణీ చేశారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులతోపాటు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. అధ్యాపకులు శ్రీహరి, దిలీప్‌కుమార్, తదితరులు ఉన్నారు.

ఘనంగా మార్కండేయస్వామి జయంతి


కుంటాల: పాల్గొన్న ఎమ్మెల్యే రామారావు పటేల్


ఖానాపూర్: తిమ్మాపూర్‌లో పాల్గొన్న సభ్యులు


తానూరులో పూజలు చేస్తున్న భక్తులు

కుంటాల: మండలంలోని కల్లూరు శ్రీమార్కండేయ స్వామి ఆలయంలో శనివారం శ్రీ మార్కండేయ జయంతి నిర్వహించారు. మార్కండేయ డోలారోహణంలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్, పద్మశాలి సంఘం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

భైంసాటౌన్:పట్టణంలో పద్మశాలి సంఘ భవనం, ఏపీనగర్‌లోని సంఘ భవనంలో మార్కండేయ జయంతి నిర్వహించారు.

ఖానాపూర్: పట్టణంలోని తిమ్మాపూర్, ఖానాపూర్ పద్మశాలి సంఘాల ఆధ్వర్యంలో మార్కండేయ జయంతి నిర్వహించారు. రాజన్న, రమణయ్య, భీమేశ్వర్, అనిల్, రమేశ్, అంజయ్య, సునీల్, భూమన్న, రాజేందర్, నాగరాజు, రవిచరణ్, ఆశన్న, రాజేశ్వర్, గంగన్న, శ్రీనివాస్ ఉన్నారు.

లక్ష్మణచాంద: మండలకేంద్రం, వడ్యాల్ మార్కండేయస్వామి ఆలయాల్లో మార్కండేయ జయంతి నిర్వహించారు. నిర్మల్ ఏఎంసీ వైస్ చైర్మన్ ఈటెల శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ రాజేశ్వర్, పద్మశాలి సంఘం మండలాధ్యక్షుడు బిట్లింగ్ నారాయణ, నాయకులు రవికిరణ్, నాగేష్, రవి పాల్గొన్నారు.

తానూరు: మండలకేంద్రంలోని మార్కండేయ ఆలయంలో భక్తులు అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదానం నిర్వహించారు. కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ముధోల్: మండలంలోని చించాలలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో పురోహితులు బసవరాజు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

భైంసా: భైంసా మండలం ఇలేగాంలో మార్కండేయ ఆలయాన్ని అలంకరించారు. ఉదయం అభిషేకం, పూజలు మధ్యాహ్నం అన్నదానం చేశారు.

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని బంగల్‌పేట్, మహాలక్ష్మీవాడ, బాగులవాడ, ఆదర్శనగర్, ప్రియదర్శినినగర్, వెంకటాపూర్, పద్మశాలి సంఘ భవనాల్లో మార్కండేయస్వామి జయంతి ఘనంగా నిర్వహించారు. సంఘ సభ్యులు పాల్గొన్నారు.

విద్యావలంటీరు ఏర్పాటుకు ముందుకొచ్చిన దాత


రాజశేఖర్‌రావును సన్మానిస్తున్న సిబ్బంది

లోకేశ్వరం: మండలంలోని బిలోలి ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉండటంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. దీంతో అదే గ్రామానికి చెందిన తిమ్మాపూరం రాజశేఖర్‌రావు పాఠశాలలో విద్యావలంటీర్ ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చారు. విద్యార్థులకు ఇబ్బంది కల్గకుండా విద్యావలంటీర్‌కు ఏడాది పాటు ప్రతి నెల రూ.ఐదు వేల గౌరవ వేతనం ఇచ్చేందుకు అంగీకరించాడు. అనంతరం దాత రాజశేఖర్‌రావును పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సామ దేవేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు ధనుంజయ్, మెండె వెంకటరమణ, వీడీసీ సభ్యులు శనివారం సన్మానించారు.

కమిషనర్‌కు సన్మానం

నిర్మల్‌టౌన్: నిర్మల్ మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన జగదీశ్వర్‌గౌడ్‌ను శనివారం మున్సిపల్ కార్యాలయంలో పలువురు నాయకులు సన్మానించారు. ఆయనకు పూలమాల వేసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మోకు దెబ్బ జాతీయ అధ్యక్షుడు సర్సాగౌడ్, జిల్లా అధ్యక్షుడు గోపిగౌడ్, తాజా మాజీ కౌన్సిలర్ రప్పు, అనుముల భాస్కర్ తదితరులు ఉన్నారు.

కాల్వతండా వాసికి డాక్టరేట్


డాక్టరేట్ స్వీకరిస్తున్న రాథోడ్ సందీప్

దిలావర్‌పూర్: మండలంలోని కాల్వతండాకు చెందిన రాథోడ్ సందీప్ డాక్టరేట్ అందుకున్నాడు. ఎమ్మెస్సీ అగ్రికల్చర్ పూర్తి చేసిన సందీప్ సామాజిక వ్యవసాయవిద్యలో పరిశోధన చేసినందుకు ఈ పురస్కారం లభించింది. వెల్ ఎడ్యుకేషన్ అండ్ పీస్ కౌన్సిల్‌వారు శుక్రవారం రాత్రి ఢిల్లీలో రాజ్యాంగ సముదాయ భవనంలో సందీప్‌కు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఇందులో నాఫెడ్ డైరెక్టర్ అశోక్ ఠాగూర్, సుప్రీంకోర్టు అడ్వకేట్ తరుణ్ మాథ్యూ, జాతీయ యువజన విభాగం కార్యదర్శి ఆనంద్ ఉప్రేతీ, రవి జగన్నాథ్, దీప, సీఈవో శర్వణ పాల్గొన్నారు.

బద్దిపోచమ్మ ప్రతిష్ఠాపనోత్సవాలు


మంగళహారతులతో ఆలయానికి వస్తున్న భక్తులు

భైంసాటౌన్: పట్టణంలోని భట్టిగల్లి బద్దిపోచమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు ఉత్సవాలు జరుగనుండగా మొదటి రోజు అమ్మవారి విగ్రహ శోభాయాత్ర నిర్వహించారు. వివిధ కాలనీల నుంచి భక్తులు మార్కెట్ ఏరియాలోని మహాలక్ష్మి ఆలయానికి తరలివచ్చారు. ప్రత్యేక పూజల అనంతరం అక్కడి నుంచి బద్దిపోచమ్మ ప్రతిమతో మంగళహారతులు, భజనల నడుమ శోభాయాత్రగా బద్దిపోచమ్మ ఆలయానికి చేరుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు వడ్నప్ రాజేశ్వర్, ఉపాధ్యక్షుడు పెరుగు నవీన్, కార్యదర్శి తోట రాము, కోశాధికారి రాజు, మున్నూరుకాపు సంఘం భైంసా అధ్యక్షుడు తూమోల్ల దత్తాత్రి, పిప్పెర కృష్ణ, కాలనీపెద్దలు, తదితరులు పాల్గొన్నారు. సోమవారం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన, అన్నదానం ఉంటుందని, భక్తులు తరలిరావాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

మిద్దెచింతలో సౌకర్యాలు కల్పించాలి


ర్యాలీ తీస్తున్న నాయకులు

కడెం: మండలంలోని ఉడుంపూర్ పంచాయతీలోని మిద్దెచింత గ్రామానికి విద్యుత్, రోడ్డు, తాగునీటి సౌకర్యం కల్పించాలని శనివారం సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో కడెంలో నాయకులు ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి తహసీల్దార్ ప్రభాకర్‌కు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఖానాపూర్ డివిజన్ కార్యదర్శి సునారికారి రాజేశ్ మాట్లాడారు. మిద్దెచింత గ్రామానికి యాభై ఏళ్లుగా కనీసం కరెంట్, రోడ్డు సౌకర్యం లేకపోవడంతో ఆదివాసీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ రాజశేఖరరెడ్డి సీఎంగా ఉన్న సమయంలో ప్రభుత్వం కరెంటు మంజూరు చేసినప్పటికీ అటవీ అధికారులు నిలిపివేశారని పేర్కొన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే న్యూడెమోక్రసీ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు నరసయ్య, ఐఎఫ్‌టీయూ జిల్లా కోశాధికారి దుర్గం లింగన్న, ఏఐకేఎంఎస్ నాయకులు గూట్ల ప్రసాద్, గ్రామాధ్యక్షుడు ఆత్రం మాణిక్ రావు, దుందే రావు, లింగు, మోతీరాం, మోహన్ రావు, చందు, శ్రీరామ్, తదితరులున్నారు.